కంటోన్మెంట్‌లో సెంటిమెంట్ ఫలించేనా?

తొలిసారిగా త్రిముఖ పోటీ | **బరిలో దివంగత నేతల కుమార్తెలు** | **బీజేపీ నుంచి పాత అభ్యర్థే**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో తొలిసారిగా త్రిముఖ పోరు పరిస్థితి ఏర్పడింది. అధికార బీఆర్‌ఎస్‌కు దీటుగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి మొత్తం 10 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఇండిపెండెంట్ అభ్యర్థి గజ్వేల్ భరత్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఇద్దరు దివంగత నేతల కుమార్తెలు కాగా, బీజేపీ తరఫున 2018 ఎన్నికల్లోనూ పోటీ చేసిన ఎన్. శ్రీగణేశ్ ఉన్నారు. ఐదుసార్లు కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యే గెలిచిన సాయన్న ఇటీవలే మరణించగా, ఆయన కుమార్తె లాస్య నందిత బీఆర్‌ఎస్ నుంచి, దివంగత ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇద్దరు మహిళా నేతలు సింపతీ పైనే ఆశలు పెట్టుకోగా, గత ఎన్నికల్లో ఓటమి అనంతరం కూడా నిరంతరం ప్రజల్లో ఉంటూ వచ్చిన శ్రీగణేశ్ సైతం తనకూ సింపతీ కలిసొస్తుందని ఆశిస్తున్నారు. –కంటోన్మెంట్

తండ్రి సానుభూతే బలం..



కంటోన్మెంట్ నుంచి ఐదు సార్లు గెలిచిన సాయన్న గత ఫిబ్రవరిలో మరణించారు. ఆయన వారసురాలిగా బీఆర్ఎస్ పార్టీ ఆయన కుమార్తె లాస్య నందితకు అవకాశం ఇచ్చింది. 2015 బోర్డు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన లాస్య, 2016లో కవాడీగూడ నుంచి కార్పొరేటర్‌గా గెలిచారు. మళ్లీ 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రజల్లో సాయన్న పట్ల ఉన్న సానుభూతిపైనే ఆశలతోనే ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్నారు.

తమిళ ఓటర్లపై నమ్మకం..



2014 నుంచి కంటోన్మెంట్ ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా ప్రయత్నిస్తున్న శ్రీగణేశ్‌కు ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కలేదు. 2018లోనూ బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి, గత నెలలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని ఆఖరికి బీజేపీ నుంచి టికెట్ దక్కించుకున్నారు. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఈయన ఒక్కడికే గతంలో పోటీచేసిన అనుభవం ఉంది. 2018లో ఓటమి పాలయ్యాక శ్రీగణేశ్ ఫౌండేషన్ స్థాపించి విస్తృత సేవా కార్యక్రమాలతో సొంత బలం పెంచుకున్నారు. నియోజకవర్గ పరిధిలో 30వేలకు పైగా ఉన్న సొంత సామాజిక వర్గం (అరవ మాల), బీజేపీకి అండగా నిలిచే ఉత్తరాది ప్రాంత వాసులు, కాలనీ ఓటర్లపై ఆశలు పెట్టుకున్నారు.

ఓటు బ్యాంకుపై ఆశలు..



దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తెగా రాజకీయ ఆరంగేట్రం చేసిన జీవీ వెన్నెల పోటీ చేస్తున్న అభ్యర్థులందరి కన్న ఉన్నత విద్యావంతురాలు. పీహెచ్‌డీ చేసిన ఆమె పలు సామాజికాంశాలపై పరిశోధనలు కూడా చేశారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ఎంపిక చేసిన అభ్యర్థి కావడంతో అంతే దూకుడుగా ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్నారు. గద్దర్ అభిమానులు, సాంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లతో పాటు మైనార్టీ ఓటర్ల భరోసాతో బరిలోకి దిగారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఇంటింటి ప్రచారంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి కల్లబొల్లి మాటలు, ఆచరణకు సాధ్యం కాని హామీలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అమీర్‌పేట డివిజన్‌లోని హనుమాన్ దేవాలయం, కుమ్మరి బస్తీ, సిక్‌వాడ, హరిజన బస్తీలో బుధవారం ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. సిక్‌వాడలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమర్థవంతమైన నాయకత్వం ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్ర ప్రజలకు శ్రీరామ రక్ష అని, నిరంతరం ప్రజలకు మేలు చేయాలని ఆలోచించే వ్యక్తి అని కేసీఆర్ అన్నారు. 40 ఏళ్లుగా సనత్‌నగర్‌లో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో జరిగిందని 2014కు ముందు రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ ఎలా ఉండేదో ప్రజలకు తెలుసన్నారు. తాను ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నాయకుడిని కాదని, నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని గుర్తుచేశారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ నేతలు హనుమంత్‌రావు, సంతోష్, అనంజీత్‌కౌర్, లలితాచౌహాన్, సుమిత్‌సింగ్, గులాబ్ సింగ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా... ఆశీర్వదించండి



బన్సీలాల్‌పేట్‌లో..

బన్సీలాల్‌పేట్: ఎంతో అభివృద్ధి చేశా మరో సారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం ఆయన బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఏ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కాని సనత్‌నగర్ నియోజకవర్గాన్ని తన హయాంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలతో ఓట్ల కోసం వచ్చే నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

సనత్‌నగర్: ఎన్నికల సమయంలో వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అమర్‌పేట డివిజన్ బాపునగర్‌కు చెందిన యాదీలాల్, అంజద్, కరణ్‌సింగ్, రతన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 40 ఏళ్లుగా అధికారంలో ఉండి ఏమీ చేయలేయని కాంగ్రెస్, మతాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేసే బీజేపీలను ప్రజలు నమ్మరన్నారు. ప్రచారంలో బాపునగర్ అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వలేదు

పద్మారావుగౌడ్



బౌద్ధనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: ప్రజలకు నిరంతరం తాము అందుబాటులో ఉన్నామని, వర్షాకాలంలో సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ అండగా నిలిచామని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని ఈశ్వరీబాయి నగర్, ఎల్ నారాయణ నగర్, అంబర్‌నగర్, సంజయ్ గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కంది శైలజతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తాము చేపట్టిన వివిధ శాశ్వత చర్యల పట్ల ప్రజలు భారీ వర్షాలు కురిసినా ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నారు. ప్రజలకు అందుబాటులో నిలిచిన తమకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. ఈ ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొండిబండ సంఘం మద్దతు..



పద్మారావుకు మద్దతు ప్రకటిస్తున్న శంకర్

చిలకలగూడ: సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుకు తెలంగాణ మొండిబండ కుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌కు చెందిన పొగర్తి శంకర్ పద్మారావును మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొండిబండ కులస్తుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని పద్మారావు హామీ ఇచ్చారని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామేశ్వర్, కిషోర్, పొగర్తి భువన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయాలి..

అడ్డగుట్ట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్‌లో నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. ఈ నెల 18న సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రెండు డివిజన్లలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఆయన అడ్డగుట్టలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్‌తో కలిసి పర్యటిస్తూ మాట్లాడారు.

'కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల

రసూల్‌పురా: తాను నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి గెలిపిస్తారని హామీ ఇస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన పార్టీ అభ్యర్థి గజ్వేల్ భరత్ వెన్నెలకు మద్దతుగా నామినేషన్ ఉపసంహరించుకున్న సందర్భంగా పీసీసీ సెక్రటరి అయూబ్‌ఖాన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెన్నెల మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకులు ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, వెంకటేష్, అయూబ్ ఖాన్ ఇతర నాయకులు తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని తిరిగి నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో నాగేష్, భరత్, నగర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి జమీల్ పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: సిర్పూర్ నుంచి పోటీ చేస్తున్న బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై హత్యారాజకీయాలు తగవని బహుజన జేఏసీ, ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ప్రవీణ్‌కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం ఓయూలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జేఏసీ నేత వేల్పుల సంజయ్ మాట్లాడుతూ.. సిర్పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనప్ప నీచ రాజకీయాలకు తెగబడుతున్నారని ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడతున్నారని ఆరోపించారు. దాడికి ఉసిగొల్పిన ఎమ్మెల్యే కోనప్పను అరెస్ట్ చేయాలన్నారు.

కులగణన చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బిహార్ తరహా అన్ని రాష్ట్రాలలో కులగణన చేపట్టాలన్నారు. ఏపీలో బీసీ కులగణన చేయడం పట్ల ఆ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

కంటోన్మెంట్‌లో లాస్య గెలుపు ఖాయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రజల అండతో దివంగత సాయన్న కుమార్తె లాస్య నందిత గెలుపు ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యధిక సంఖ్యలో క్యాడర్ కలిగిన పార్టీలో ఏకాభిప్రాయంతో ముందుకు సాగడంలో చిన్నపాటి ఇబ్బందులు సహజమేనన్నారు. తాను ఇన్‌చార్జ్‌గా ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ క్యాడర్ మధ్య సమన్వయం చేస్తున్నామన్నారు. గురువారం క్లాసిక్ గార్డెన్స్‌లో నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరవుతారన్నారు. ఈ నెల 21 మంత్రి కేటీఆర్ రోడ్ షో, 25న పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సభలు ఉంటాయన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కంటోన్మెంట్ ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు క్యాడర్ లేరని.. బీఆర్ఎస్ కు మాత్రమే వాడవాడలా క్యాడర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లాస్య నందిత, గజ్జెల నాగేశ్, ఎమ్మెన్ శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్, లోకనాథం, శ్యామ్ కుమార్, నళిని, అనిత ప్రభాకర్, టీఎస్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ బరిలో 16 మంది

సనత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు సైతం ముగిసింది. బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. ఇక కురుక్షేత్ర సంగ్రామమే తరువాయి. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మొత్తం16 మంది వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. నియోజకవర్గం నుంచి 21 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి 37 నామినేషన్లు వేశారు. ఇందులో ముగ్గురు నామినేషన్లు (విజయ విజ్ఞాన శాంతికుమారి–నవరంగ్ కాంగ్రెస్ పార్టీ, మోరే హేమ–ఇండియన్ బిలీవర్స్ పార్టీ, మహ్మద్ అల్తాఫ్–స్వతంత్ర అభ్యర్థి) వివిధ కారణాలతో తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. మిగతా 18 మందిలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన వీజేఎస్ ప్రకాష్‌రావు పలువాయి, యుగ తులసి పార్టీ నుంచి నామినేషన్ వేసిన ఉప్పల పాటి శ్రీనివాస్‌లు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటున్నట్లు బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిషన్‌రావుకు లేఖలు అందజేయడంతో సనత్‌నగర్ బరిలో 16 మంది ఉన్నారు.

త్రిముఖ పోటీయే..

16 మంది బరిలో ఉన్నా ప్రధానంగా త్రిముఖ పోటీనే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే గట్టి పోటీ ఉంటుంది. ఇప్పటికే ఆ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. ఓటరు దేవుణ్ణి ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వేకువజాము నుంచే ఇంటింటికి తిరుగుతూ ఆయా పార్టీల సిద్ధాంతాలు, చేసే పనులపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక మరోవైపు అర్ధరాత్రుల వరకు కాలనీల అసోసియేషన్లు, యువజన సంఘాలు, కుల సంఘాల వారితో సంప్రదింపులు జరుపుతూ తమకు మద్దతు తెలపాలని కోరుతూ అందుకు వారి అడిగిన నజరానాలు సైతం ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. అయితే.. వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు సైతం గెలుపు తమదేనంటూ తమదైన శైలిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

లాలాపేట: తార్నాక దళిత క్రిస్టియన్ పొలిటికల్ కమిటీ ఆర్గనైజేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, లాలాగూడ తదితర ప్రాంతాలకు చెందిన దళిత క్రైస్తవులు ఈ ఆర్గనైజేషన్‌లో సభ్యులుగా ఉన్నారు. అధ్యక్షుడిగా బండ అబ్రహం, ఉపాధ్యక్షుడిగా కె జె జయకర్, జె.శాంసన్, ప్రధాన కార్యదర్శిగా గంథమల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా జి. జాన్‌బాబు, పీడి అజరయ్య మోజెస్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా బండ ఆనంద్, కోశాధికారిగా విద్యాసాగర్, సలహాదారుగా బాస్కుల కొమురయ్య ఎన్నికయ్యారు.



గైనిక్ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

సనత్‌నగర్: గైనకాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వసుంధర చీపురుపల్లి అన్నారు. గైనకాలజీ సమస్యలపై అపోహలు–వాస్తవాలు అనే అంశంపై బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వసుంధర చీపురుపల్లి మాట్లాడుతూ.. యవ్వన దశ నుంచే యువతుల్లో అనేక సమస్యలు వస్తుంటాయని ముఖ్యంగా రుతుక్రమంలో ఇబ్బందులు పడుతుంటారని, కుటుంబ సభ్యులతో కూడా పంచుకోకుండా వారిలో వారే మథన పడతారన్నారు. దీని వల్ల మానసికంగా కుంగిపోయి అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతారన్నారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా మహిళలందరికీ అవగాహన ఉండాలన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 15, పొడుగు వంకాయ 13, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 15, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 13, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 21, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కృష్ణారావును మరోసారి గెలిపించుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గెలిపించుకుని అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూసుకుందామని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి అన్నారు. మాధవరం కృష్ణారావుకు మద్దతుగా బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, మయూరిమార్గ్ తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత 50 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను సైతం మాధవరం కృష్ణారావు పరిష్కరించారన్నారు. శ్యాంలాల్ బిల్డింగ్ శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించడంతో పాటు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేశారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల అభివృద్ధి ఇలా ప్రజావసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చిన ఎమ్మెల్యేను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, అమరం శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్మహత్యలు లేని రాష్ట్రం కోసం పని చేస్తాం



ఓయూలో ప్రమాణం చేస్తున్న వీఆర్‌పీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 60 మంది నిరుద్యోగులు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షులు సునీల్ యోచ్చు మాట్లాడారు. నిరుద్యోగులు ఇతర పార్టీల గెలుపు కోసం పని చేయకుండా స్వతహాగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు, రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను మలిచేందుకు వీఆర్‌పీ పని చేస్తుందన్నారు. ఆత్మహత్యలు లేని రాష్ట్రం కోసం పని చేస్తామని ప్రమాణం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమలాకర్, అనిల్, స్వాతిరెడ్డి, సౌమ్య, మన్మోహన్, సత్య, సురేందర్‌రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అడ్డగుట్ట: రాష్ట్రంలో ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలను ఓడించాల్సిన అవసరం ఉందని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల కన్వీనర్ ముత్తయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాలాగూడ రైల్వే క్యారేజ్ వర్క్‌షాప్ ఆవరణలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. గెలిచిన ప్రభుత్వాన్ని నిరంతరం ప్రజలు ప్రశ్నించాలని, ప్రజా, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వాలను ఓడించాలని కోరారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే మతోన్మాద శక్తులకు ఈ ఎన్నికలో గుణపాఠం చెప్పాలన్నారు. సత్యనారాయణ, వెంకటేష్, ప్రసన్న, నాయక్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శ్రీగణేష్

రసూల్‌పురా: ఉచిత మంచినీటి పథకం కంటోన్మెంట్‌లో అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో బీజేపీ కోర్టును ఆశ్రయించి ఉచిత తాగునీటి పథకం అమలుకు చర్యలు తీసుకుందని బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ తెలిపారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో మూడవ వార్డు కార్ఖానలో మహంకాళి టెంపుల్ లేన్, చర్చిగల్లి, తమిళ్ బస్తీ, కిందిబస్తీ, మీది బస్తీ తదితర బస్తీలు, ఏడవ వార్డు పెద్దకమేళాలో బుధవారం శ్రీ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అభివృద్ధి విషయంలో సవతి తల్లి ప్రేమ కనబర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ఓటర్లు నిర్ణయించుకున్నారని వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తామని హామీలు ఇస్తున్నారన్నారు. కుటుంబ పాలన కావాలో ప్రజా సేవకుడు కావాలో ఓటర్లు నిర్ణయించుకోవాలన్నారు. శ్యామ్, విన్సెంట్, చందు, పరమేష్, చంద్రకాంత్, ఆశోక్, నాగరాజు, మణికంఠ, కస్తూరి, మాల, శోభన, జ్యోతి పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో అగ్ని ప్రమాదం



బౌద్ధనగర్: సంజయ్ గాంధీ నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ తీగలన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.